సాక్షి
జనగామ
శుక్రవారం | 16 | జూన్ | 2023



అన్నదాతలూ.. అప్రమత్తం

విత్తనాల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలి. నకిలీలను గుర్తించకపోతే నష్టపోతారని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. - 8లో



ఆన్‌లైన్ మోసం

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కిన మానుకోట మండలం కొమ్ముగూడెంతండా వాసి రూ.2.50లక్షలు పోగొట్టుకున్నాడు. - 8లో

గరిష్టం/కనిష్టం $41^0/29^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి వేడి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి సమయంలో ఉక్కపోత పెరుగుతుంది.

ఐదు జీపీలకు ఐఎస్‌ఓ

సర్టిఫికెట్లకు ఎంపికైన గ్రామాలు
- ప్రపంచ చిత్రపటంలో పల్లెల ముఖచిత్రం
- అంతర్జాతీయంగా నిధులకు అవకాశం
- మరింత అభివృద్ధికి దోహదం.. ఏడాదిపాటు అమలు

జిల్లా పరిధిలోని ఐదు గ్రామాలకు ఐఎస్‌ఓ సర్టిఫికెట్లు దక్కాయి. అంతర్జాతీయ ప్రమాణాలకు తగినట్టుగా సుపరిపాలన అందిస్తున్న జీపీలకు ఈ సర్టిఫికెట్ ఇస్తున్నారు. సర్టిఫికెట్ వచ్చిన తర్వాత ఏడాది కాలపరిమితితో.. ప్రపంచ చిత్రపటంలో ఆ ఊరు పాపులర్‌గా మారనుంది. ప్రభుత్వాలు అందించే నిధులతో పాటు ఎన్‌జీఓల ద్వారా సమకూర్చుకునే అవకాశం ఉంటుంది.

– జనగామ

జిల్లా పరిధి బచ్చన్నపేట మండలం కొడవటూరు, పాలకుర్తి, చిల్పూరు మండలం చిన్న పెండ్యాల, దేవరుప్పుల మండలం కడవెండి, లింగాలఘణపురం మండలం నెల్లుట్ల గ్రామాలు ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌కు ఎంపికయ్యాయి. ఇటీవల జీపీలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా.. లండన్‌కు చెందిన సంస్థ ప్రతినిధులు ఆయా గ్రామాల్లో పర్యటించారు. జీపీల్లో అమలవుతున్న పనులను పరిశీలించారు. 70 నుంచి 80 శాతం సేవలు బాగున్నట్లు నిర్ధారించి ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

ప్రపంచ చిత్రపటంలో..

ఐఎస్‌ఓ సర్టిఫికెట్ పొందిన గ్రామ పంచాయతీలు ప్రపంచ చిత్రపటంలో పాపులర్‌గా మారుతాయి. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే సంకల్పం కలిగిన ఎన్‌జీఓ, ఇతర స్వచ్ఛంద సంస్థలు వీటిని ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులకు తోడు.. ఎన్‌జీఓల ద్వారా వచ్చే పెట్టుబడులతో మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది. అలాగే పంచాయతీ సర్వీసెస్‌లో అభివృద్ధి, క్వాలిటీ మరింత పెరగడంతో పాటు వందశాతం అవినీతి రహిత పాలన అందించే అవకాశం కలుగుతుంది. పంచాయతీల పనితీరు మెరుగు పడడంతో పాటు ఉద్యోగులు, సిబ్బంది, ప్రజల్లో క్రమశిక్షణ పెరుగుతుంది.

సర్టిఫికెట్‌కు 80 ప్రశ్నలు

ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్(ఐఎస్‌ఓ) సర్టిఫికెట్ పొందడానికి 80 ప్రశ్నలు అడిగారు. ప్రధానంగా ప్రజలకు రోజువారి అందించే తాగు నీటిలో నాణ్యత, పౌర సేవల విషయంలో జనన, మరణ, వివాహ సర్టిఫికెట్లు జారీ చేసే సమయం, పన్నుల వసూలు, జవాబుదారీతనంగా ఇచ్చే రశీదు, ఈ-పంచాయతీ, తాగు నీటి పైపులైన్ రిపేరుకు వస్తే ఎన్నిరోజుల్లో బాగుచేస్తారు, వీధి దీపాల నిర్వహణ, డ్రైయినేజీల శుభ్రత, క్లీన్ అండ్ గ్రీన్, ఇంటింటికీ తడి, పొడిచెత్త సేకరణ, పల్లె ప్రగతిలో అమలవుతున్న గ్రీనరీ, బృహత్ ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, ఇంకుడు గుంతల నిర్మాణం, భూగర్భజలాల పెంపు, వ్యక్తిగత మరుగుదొడ్లు, వాటి నిర్వహణ తదితర సేవల పరంగా పరిశీలించి.. ఇవన్నీ అంతర్జాతీయ ప్రమాణాలకు సరిపోతాయని నిర్ధారించుకున్న తర్వాత సర్టిఫికెట్‌కు అర్హత సాధించినట్లు ప్రకటించారు.



మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న ఆయా గ్రామాల సర్పంచ్‌లు సతీష్‌రెడ్డి, స్వరూపరెడ్డి, బెత్లీనాలీనారెడ్డి, లింగారెడ్డి, యాకాంతరావు



కొడవటూరు గ్రామం వ్యూ

మంత్రుల చేతలు మీదుగా..

దేవరుప్పుల మండలం కడవెండిలో జరిగిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతలు మీదుగా కొడవటూరు గ్రామ సర్పంచ్ గంగం సతీష్‌రెడ్డి, కడవెండి సర్పంచ్ పోతిరెడ్డి బెత్లీనాలీనారెడ్డి, పాలకుర్తి సర్పంచ్ యాకాంతరావు, చిన్నపెండ్యాల సర్పంచ్ మామిడాల లింగారెడ్డి, నెల్లుట్ల సర్పంచ్ స్వరూప రాణి గురువారం ఐఎస్‌ఓ సర్టిఫికెట్లు అందుకున్నారు. అనంతరం సర్పంచ్‌లు హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే వేడుకలకు తరలివెళ్లారు.

ఆనందంగా ఉంది..



జిల్లాలోని ఐదు జీపీలకు ఐఎస్‌ఓ సర్టిఫికెట్లు రావడం ఆనందంగా ఉంది. నీటి సమృద్ధి తదితర స్కీంల అమలులో జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఇప్పటికే అనేక గ్రామ పంచాయతీలు అవార్డులు సాధించి జనగామ కీర్తిని పతాక శీర్షికన నిలబెట్టాయి. ఇప్పుడు ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌తో మరితం గుర్తింపు లభిస్తుంది. ఇదే స్ఫూర్తిని కనబరుస్తూ రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి మరిన్ని అవార్డులు పొందేలా పని చేస్తాం.

– రంగాచారి, డీపీఓ, జనగామ

ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌కు ఎంపికైన గ్రామాల ఆదాయం తదితర వివరాలు..

	కొడవటూరు	పాలకుర్తి	కడవెండి	చిన్న పెండ్యాల	నెల్లుట్ల
జనాభా	1,798	7,819	3,197	4,006	6,500
పన్నుల డిమాండ్	రూ.2,49,091	రూ.24,25,865	రూ.4,21,355	రూ.12,67,961	రూ.5.35లక్షలు
వసూళ్లు	రూ.2,49,091	రూ.15,44,235	రూ.4,21,355	రూ.12,67,961	రూ.5.35లక్షలు
నల్లా కనెక్షన్లు	478	2,450	1,140	753	1,804
కుటుంబాలు	462	2,450	1,250	1,144	1,804
ఇంకుడు గుంతలు	408	2,280	876	422	794

ఎర్రబెల్లి.. బతుకమ్మ ఆట

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని దేవరుప్పుల మండలం కడవెండిలో గురువారం పల్లెప్రగతి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దయాకర్‌రావు మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.

– దేవరుప్పుల

- వివరాలు 8లో



పల్లెప్రగతి వేడుకల ర్యాలీలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న మంత్రి ఎర్రబెల్లి

ఉత్తములకు సత్కారం

జిల్లాలో 29 మంది ఎంపిక
కలెక్టర్ నేతృత్వంలో హైదరాబాద్‌కు..



కలెక్టరేట్ నుంచి హైదరాబాద్‌కు తరలుతున్న అధికారులు, కార్మికులు, సర్పంచ్‌లు

జనగామ: గ్రామ పంచాయతీల్లో పేదరిక నిర్మూలన, జీవనోపాధి, అందరికీ ఆరోగ్యం, చైల్డ్ ఫ్రెండ్లీ, ఇంటింటికీ వందశాతం తాగునీటి సరఫరా, పల్లె స్వచ్ఛత, గ్రామాల్లో స్వయం సమృద్ధి–మౌలిక వసతులు, ప్రజల సామాజిక భద్రత, సుపరిపాలన, మహిళా స్నేహపూర్వక వాతావరణం కల్పించడంలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులను ప్రభుత్వం గుర్తించింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగే 'పల్లె ప్రగతి దినోత్సవం' వేడుకల్లో వారికి అవార్డులు ప్రదానం చేశారు. అవార్డులు అందుకున్న వారిలో.. కె.రంగాచారి(డీపీఓ), సీహెచ్.పార్థసారధి(డీఎల్‌పీఓ జనగామ), బి.వెంకటప్రసాద్(డీఎల్‌పీఓ స్టేషన్‌ఘన్‌పూర్), యూ.సంపత్‌కుమార్(ఎంపీఓ జనగామ), చిట్ల స్వరూపారాణి (సర్పంచ్ నెల్లుట్ల), బిల్ల అంజమ్మ(సర్పంచ్, కామారెడ్డిగూడెం), రొండ్ల శ్రీనివాస్‌రెడ్డి(పంచాయతీ సెక్రెటరీ నెల్లుట్ల), ఎండీ.ఇఫ్తకార్ (పంచాయతీ సెక్రెటరీ శామీర్‌పేట), గంగం సతీష్‌రెడ్డి(సర్పంచ్, కొడవటూరు), మరిపెల్లి తిరుమల(సర్పంచ్, రాజవరం), కొంగర రవి(సర్పంచ్, మల్కాపూర్), ఎల్.రజిత (సర్పంచ్, కొండాపూర్), కేశిరెడ్డి ప్రత్యూశారెడ్డి(సర్పంచ్ శ్రీపతిపల్లి), తాండ్ర స్వరూప(సర్పంచ్ ఎఫ్ఏసీ శామీర్‌పేట), శివరాత్రి స్వప్న (సర్పంచ్ పసరమడ్ల), కాటం విజయ(సర్పంచ్ బండ్లగూడెం), సి.శ్వేత(సర్పంచ్ మాణిక్యాపురం), దూసరి గణపతి(సర్పంచ్ నేలపోగుల), పగడాల విజయ (సర్పంచ్ హన్మంతాపూర్), ఎ.కమలాకర్‌రెడ్డి(సర్పంచ్ నర్మెట) కె.పద్మ(సర్పంచ్ మంగలిబండతండా), ముప్పిడి శ్రీధర్ (సర్పంచ్ ఖిలాషాపూర్), పోకల శివకుమార్(సర్పంచ్ రఘునాథపల్లి), బిర్రు లక్ష్మి(సర్పంచ్ నిడిగొండ), అర్జుల రమాదేవి(సర్పంచ్ అబ్దుల్‌నాగారం), ఇల్లందుల కుమార్(సర్పంచ్ కూనూరు), జోగు ఉప్పలయ్య (మల్టీ పర్పస్ వర్కర్ దేవరుప్పుల), తాండ్ర భాగ్య(మల్టీ పర్పస్ వర్కర్, శామీర్‌పేట), కె.రాములు (మల్టీ పర్పస్ వర్కర్ నెల్లుట్ల) మొత్తం 29 మంది ఉన్నారు. వీరంతా కలెక్టర్ శివలింగయ్య ఆధ్వర్యంలో డీపీఓ రంగాచారి నేతృత్వంలో హైదరాబాద్‌కు తరలివెళ్లారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే 'పల్లెనిద్ర'

- ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజయ్య

జఫర్‌గఢ్: ప్రజాసమస్యల పరిష్కారానికే 'పల్లెనిద్ర' కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పేర్కొన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కూనూర్ గ్రామంలో బుధవారం రాత్రి 'పల్లెనిద్ర'లో గ్రామస్తులతో రచ్చబండ నిర్వహించారు. గురువారం ఉదయం కాలనీల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో గడప గడపకూ సంక్షేమ పథకాలు అందడంతోపాటు రాష్ట్ర అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, ఈ విషయాన్ని దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన పల్లెప్రగతి దినోత్సవ ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే.. అనంతరం ఇటీవల మృతి చెందిన గోలి శోభ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ రడపాక సుదర్శన్, జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుజ్జరి రాజు, మహేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్




సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి విక్రమ్

జనగామ రూరల్: సమాజంలో ప్రతి ఒక్కరూ బాల హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ అన్నారు. బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని అరబిందో స్కూల్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 14 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకోకుండా చూడాలని, వారంతా బడిలో ఉండాలని పేర్కొన్నారు. ఎవరైన పనిలో చేర్చుకుంటే కఠిన చర్యలు ఉంటాయని, ఈ విషయమై పిల్లల తల్లిదండ్రులు, వివిధ యాజమాన్యాలు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. నిర్బంధ విద్య అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలు, ఎరువులు అమ్మితే చర్యలు

- జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

రఘునాథపల్లి: రైతులకు కల్తీ విత్తనాలు, ఎరువులు అమ్మితే చర్యలు తీవ్రంగా ఉంటాయని జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్ హెచ్చరించారు. వానాకాలం పంటల సాగుపై గురువారం మండల పరిధి నిడిగొండ రైతు వేదికలో తెలంగాణ ఆగ్రోస్ కార్పొరేషన్, వ్యవసాయశాఖ సంయుక్తంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆగ్రోస్ రైతు సేవాకేంద్రాల నిర్వాహకులు అన్నదాతలకు నాణ్యమైన సేవలందించాలన్నారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్కులు, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. ఆగ్రోస్ జిల్లా మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్ అశోక్ మాట్లాడుతూ ఆగ్రోస్ కేంద్రాల్లో నాణ్యతతో కూడిన పేరుగాంచిన కంపెనీలతో ఒప్పందం చేసుకొని విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఆర్గానిక్ ప్రొడక్ట్స్, టార్పాలిన్లు, స్ప్రేయర్లు, డ్రోన్స్, రొటోవేటర్లు సరసమైన ధరలకు అందిస్తామని చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి కాకి శ్రీనివాస్‌రెడ్డి, ఏఈఓ సుష్మిత, ఆగ్రోస్ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, ఏఆర్ఎస్ నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు పట్టణంలో విద్యుత్ కోతలు

జనగామ: పట్టణంలో నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్న క్రమంలో నేడు(శుక్రవారం) కరెంటు కోతలు ఉంటాయని ఎస్పీడీసీఎల్ ఏఈ శంకర్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. నాలా నిర్మాణం, రహదారుల విస్తరణతో పాత విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బాలాజీనగర్‌రోడ్డు పరిధి 1, 2, 3, 4, 5, 6, ఎల్లమ్మ టెంపుల్, జ్యోతినగర్ రోడ్ నంబర్ 1, 2, శ్రీవిల్లాస్ కాలనీ, క్లాంకమాన్ వైపు, సెయింట్‌మేరీస్ స్కూల్, కోటిరత్నం ఆస్పత్రి, సూర్యాపేట రోడ్, ఎస్ఎంఆర్ గార్డెన్, హైదరాబాద్‌రోడ్డు తూర్పు వైపు, ఏకశిలా బీఈడీ కళాశాల, దత్తంరెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ కోతలు ఉంటాయని, వినియోగదారులు సహకరించాలని కోరారు. అలాగే కేబుల్ టీవీ, ఇంటర్నెట్ తదిత నెట్‌వర్క్ ప్రతినిధులు విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన వైర్లను తొలగించాలని, లేని పక్షంలో తాము తొలగిస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

శ్రీశ్రీ ఆశయ సాధనకు కృషి చేయాలి



జనగామ: శ్రీశ్రీ వర్ధంతి కార్యక్రమంలో కవులు

జనగామ రూరల్: శ్రీశ్రీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు లగిశెట్టి ప్రభాకర్ అన్నారు. గురువారం శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శ్రీశ్రీ తన కవితలతో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి సమసమాజ నిర్మాణానికి కృషి చేసినట్లు పేర్కొన్నారు. జి.కృష్ణ, సోమేశ్వరాచారి, భాస్కర్, రామచంద్రం, మహేందర్, సదానందం, సాయికిరణ్, శివనాథ్ పాల్గొన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి టౌన్: స్థానిక రాజీవ్‌చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో కవి, రచయిత మామిండ్ల రమేష్‌రాజా, జన సాంస్కృతిక మండలి జిల్లా కన్వీనర్ బుజేందర్, సామాజిక కార్యకర్త గుమ్మడిరాజు సాంబయ్య, ఐప్వా కార్యదర్శి రజిత, దేవసాని ఉపేందర్, ప్రజాసంఘల నాయకులు పాల్గొన్నారు.

నీట్‌లో గిరిజన కళాశాల విద్యార్థుల ప్రతిభ

హన్మకొండ చౌరస్తా: నీట్ పరీక్షలో హనుమకొండ పెద్దమ్మగడ్డ సమీపంలోని తెలంగాణ గిరిజన ప్రతిభా కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ నందమూరి పద్మిని హర్షం వ్యక్తం చేశారు. కళాశాల విద్యార్థులు మూడావత్ కావ్యాంజలి 467వ, మాలావత్ స్వాతిప్రియ 394వ, కొర్ర రేఖ 371వ, తేజావత్ నవ్యతేజ 367, నేనావత్ శారద 363వ ర్యాంకులు సాధించి ఎంబీబీఎస్ సీట్లు పొందడానికి అర్హత సాధించినట్లు తెలిపారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు కళాశాల అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

పాలకుర్తిలో ఉంటా.. ప్రజాసేవ చేస్తా..

ఎన్ఆర్ఐ, కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి
- స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు
- శ్రీసోమేశ్వరాలయంలో పూజలు
- వసతి గృహాలకు రూ.20 లక్షల విరాళం




విలేకరులతో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

పాలకుర్తి టౌన్: పాలకుర్తి నియోజకవర్గ ప్రజల ప్రేమానురాగాలు నన్ను అమెరికా నుంచి ఇక్కడికి వచ్చేలా చేశాయి.. ఇక్కడే ఉండి ప్రజలకు సేవ చేస్తానని ఎన్ఆర్ఐ, కాంగ్రెస్ నాయకురాలు హనుమాన్ల ఝాన్సీరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రానికి చేరుకున్న ఆమెకు రాజీవ్ చౌరస్తా నుంచి పార్టీ కార్యకర్తలు వాహనాలతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన తర్వాత ఝాన్సీరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలకుర్తి నియోజవర్గ పరిధి తొర్రూరు మండలం చర్లపాలెంకు చెందిన తాను 40 ఏళ్ల క్రితం అమెరికాకు వెళ్లి అక్కడే స్థిరపడినట్లు చెప్పారు. అమెరికాలో ఉన్నప్పటికీ పుట్టిన గడ్డపై ఉన్న మమకారంతో స్వచ్ఛందంగా అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఇక నుంచి పాలకుర్తిలోనే ఉండి ప్రజాసేవకు అంకితం అవుతానని స్పష్టం చేశారు. పాలకుర్తి ఎమ్మెల్యే, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో తనకు ఎలాంటి విభేదాలు లేవని, త్వరలోనే రాజకీయపరమైన నిర్ణయం తీసకుంటానని పేర్కొన్న ఆమె.. ప్రజల ఆశీస్సుల కోసం ఎదురుచూస్తున్నానని తెలిపారు. అమెరికా నుంచి వచ్చిన తనపై ఇంతటి ప్రేమ చూపించిన అభిమానులు, ప్రజలు, పార్టీ కార్యకర్తలకు రుణపడి ఉంటానని అన్నారు. ఈ సందర్భంగా పాలకుర్తి శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో వసతి గృహ నిర్మాణానికి రూ.20 లక్షలు తన వంతుగా సాయంగా అందజేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో కొడకండ్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, పార్టీ పాలకుర్తి, కొడకండ్ల, దేవరప్పుల మండలాల అధ్యక్షులు గిరగాని కుమారస్వామి, ఇ.సురేష్‌నాయక్, పెద్ది కృష్ణమూర్తి, హమ్యానాయక్, నాయకులు బొమ్మగాని భాస్కర్, భైరు భార్గవ్, అనుముల మల్లారెడ్డి, బండిపెల్లి మణెమ్మ, గోనె మహేందర్, గాదెపాక భాస్కర్, ఐలేష్, మాడరాజు యాకయ్య, లావుడియా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల పేరిట ఆస్తులు మార్చొద్దు : సీపీ

హసన్‌పర్తి: తమ పేరిట ఉన్న ఆస్తులను పిల్లల పేరిట మార్చొద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ వృద్ధులకు సూచించారు. హనుమకొండ నగరంలోని గోపాలపురంలో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు బతికున్నంత కాలం ఆస్తుల్ని కాపాడుకోవాలన్నారు. బాధ్యత తీరిపోయిందని, పిల్లల పేరిట ఆస్తులు మార్పిడి చేస్తే ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. వృద్ధులకు ఏ చట్టపరమైన సమస్య ఉన్నా పోలీస్ శాఖ సహకరిస్తుందన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సయ్య, కార్యదర్శి యుగంధర్, జిల్లా సంక్షేమశాఖ అధికారి మధురిమ, సీడబ్ల్యూసీ జిల్లా కమిటీ సభ్యుడు దామోదర్ పాల్గొన్నారు.

కబ్జాలో ఉన్నవారిని కదిలించొద్దు



బచ్చన్నపేటలో విచారిస్తున్న శిక్షణ అధికారులు

బచ్చన్నపేట : భూమిపై కబ్జాలో ఉన్న వారిని కదిలించొద్దని క్రైమ్ డీసీపీ మురళీధర్, శిక్షణ ఐపీఎస్, ఐపీఎస్‌లు అంకిత్, శ్రద్ధాశుక్లా, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సతీష్ బాబు పేర్కొన్నారు. స్థానిక ఎస్ఆర్ పెట్రోల్ పంపు సమీపాన ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి, పక్క భూమి వారికి మధ్య నెలకొన్న భూ వివాదంపై గురువారం విచారణ చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ మార్క కిషన్ తన భూమి తగాదా విషయంలో 580, 582 సర్వే నంబర్లపై వరంగల్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారని, ఆయన ఆదేశాల మేరకు విచారణకు వచ్చామన్నారు. అలాగే బచ్చన్నపేట మండలం చిన్నరామన్‌చర్ల రెవెన్యూ పరిధి గోపాల్‌నగర్ 174 సర్వే నంబర్‌లో పలువురు గుడిసెలు వేసిన విషయంపైనా విచారణ నిర్వహించామని పేర్కొన్నా రు. కార్యక్రమంలో జనగామ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, నర్మెట సీఐ నాగబాబు, ఎస్సై నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ప్రసూతికి ప్రైవేటుకు వెళ్లొద్దు



జనగామ: ప్రసూతి కోసం ఎవరు కూడా ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లొదని, ఎంసీహెచ్‌లో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రశాంత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో గురువారం ఆయన గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్ రాజు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ కేసీఆర్ కిట్ పోర్టల్‌లో పేర్లు నమోదైన వారికి న్యూట్రిషన్ కిట్లు వస్తాయన్నారు. హెల్ప్‌లైన్ సెంటర్, హెల్త్ సూపర్‌వైజర్లు, అమ్మ పిలుపు కాల్ సెంటర్ ద్వారా ప్రతి గర్భిణిని డెలివరీ సమయం ప్రకారం ఆస్పత్రికి తీసుకువస్తారని చెప్పారు. 24 గంటల పాటు సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు.

కేటీఆర్ దృష్టికి సమస్యలు ..



జనగామ: సిద్దిపేట జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన ఐటీ టవర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో కలిసి జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం జనగామ, చేర్యాల ప్రాంతానికి చెందిన సమస్యలు, రహదారుల పెండింగ్ బిల్లుల విడుదలపై కేటీఆర్‌కు వివరించగా.. సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే చెప్పారు.

బస్‌పాస్‌లకు దరఖాస్తు చేసుకోండి

జనగామ: జిల్లా పరిధి అన్ని పాఠశాల విద్యార్థులు ఉచిత, మనీ బస్‌పాస్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆర్టీసీ డీఎం జ్యోత్స్న ఒక ప్రకటనలో తెలిపారు. 12 ఏళ్లలోపు బాలురతోపాటు 10వ తరగతి వరకు చదువుకునే బాలికలకు ఉచిత పాస్‌లు జారీ చేస్తామన్నారు. అలాగే దివ్యాంగులు కూడా దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 7382852818, 9948164847, 9989175175 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గోవధ జరగకుండా చర్యలు తీసుకోవాలి



జఫర్‌గఢ్: బక్రీద్ పండుగ రోజున గోవధ జరకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ కోరారు. గురువారం మగ్దుంతండాలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతోపాటు బక్రీద్ పండుగకు నెల రోజుల ముందే ఆదేశాలివ్వాలని పేర్కొన్నారు. సంబంధిత వ్యాపారులపై కేసులు నమోదు చేసి బైండోవర్ చేయాలని, బక్రీద్‌కు ముందు రైతులు పశువులను విక్రయించకుండా చూడాల్సిన బాధ్యత జీపీలపై ఉందన్నారు. కార్యక్రమంలో గోశాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాడిపెల్లి రాజేశ్వర్‌రావు, సర్పంచ్ లక్ష్మిస్వామినాయక్, గోశాల ప్రతినిధి దేవా, గణేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షకు 72 మంది గైర్హాజరు

జనగామ రూరల్ : జిల్లాలో గురువారం జరిగిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షకు 72 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఇంటర్ విద్యాధికారి బైరి శ్రీనివాస్ తెలిపారు. జనరల్ విభాగంలో 1,376 మందికి 1,333 మంది, ఒకేషనల్ విభాగంలో 426 మందికి 397 మంది పరీక్ష రాసినట్లు పేర్కొన్నారు.

'ఉపా' కేసు ఎత్తివేయాలి

దేవరుప్పుల: తెలంగాణ రాష్ట్ర సాధనకు పాటుపడిన సాంస్కృతిక ఉద్యమకారులైన విమలక్క, మోహన్ బైరాగిపై రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా బనాయించిన 'ఉపా' కేసును సత్వరమే ఎత్తివేయాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్సూర్, జంట నగరాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతుల రమేష్, రాకేష్ గురువారం ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణలో ప్రజల్ని చైతన్య వంతులను చేసే ప్రజాగాయకుల గొంతుకలపై ఉక్కుపాదం మోపడం సరికాదన్నారు.

ఆన్‌లైన్ మోసం..

- రూ.2.50 లక్షలు నష్టపోయిన బాధితుడు
- మరో పది మంది కూడా ..
- రూ. 6 లక్షల వరకు నష్టపోయినట్లు సమాచారం




మహబూబాబాద్ రూరల్ : సైబర్ నేరాల నియంత్రణకు ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు రూపొందించినా కేటుగాళ్ల మారడం లేదు. వివిధ మార్గాల్లో మోసాలను కొనసాగిస్తూనే ఉన్నారు. బ్యాంకు ఖాతా అప్‌డేట్ చేసుకోమనో.. ఏటీఎం పిన్ నంబర్ మార్చాలి.. ఫోన్‌కు వచ్చే ఓటీపీ చెప్పమనో అమాయకులను వివిధ రూపాల్లో దోచుకుంటూనే ఉన్నారు. ఫలితంగా రోజూ ఏదో చోట పలువురు సైబర్ మోసాల బారిన పడుతున్నారు. తాజాగా మహబూబాబాద్ మండలంలోని కొమ్ముగూడెం తండా గ్రామానికి చెందిన లావుడ్య మనోహర్ ఆన్‌లైన్ మోసంలో చిక్కుకుని రూ.2.50 లక్షలు నష్టపోయాడు. మనోహర్ ఆన్‌లైన్‌లో చైనా యాప్ ద్వారా వివిధ వస్తువులు కొనుగోళ్లు చేయడంతోపాటు పెట్టుబడి కూడా పెట్టాడు. అవతలి వ్యక్తులు పలుమార్లు ఇతడికి మేలు చేసి చూపించారు. కొంత పెట్టుబడి పెట్టగా కమీషన్ రూపంలో మరికొంత మొత్తాన్ని ఆన్‌లైన్ ఖాతాదారుడికి చెల్లించారు. దీంతో మనోహర్ కమీషన్ మరింత వస్తుందని నమ్మి అధిక మొత్తంలో లావాదేవీలు జరుపగా రూ. 2.50 లక్షల వరకు నష్టపోయాడు. దీనిపై సైబర్‌క్రైం వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. అదే విధంగా కొమ్ముగూడెంకు చెందిన మరో పది మంది కూడా చైనా యాప్‌లో పెట్టుబడి పెట్టి కనీసం వస్తువు కూడా పొందకుండానే రూ. 6 లక్షల వరకు నష్టపోయి మోసపోయినట్లు తెలిసింది.

అన్నదాతలు..అప్రమత్తం

- నకిలీ విత్తనాలను గుర్తించకపోతే నష్టం
- దిగుబడిలో విత్తన నాణ్యత కీలకం
- డూప్లికేట్ సీడ్స్‌ను ఇలా గుర్తించాలి : శాస్త్రవేత్తలు





కరీమాబాద్ : అన్నదాతలు కోటి ఆశలతో ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో నకిలీ విత్తనాల బెడద వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. పత్తి, మిరప, వరి, మొక్కజొన్న విత్తనాలలో ఏది నాణ్యమైందో.. ఏది నకిలీదో తెలియని స్థితిలో గందరగోళానికి గురవుతున్నారు. ఎక్కువ దిగుబడి వస్తుందంటూ దళారులు మాయమాటలతో ఊరు పేరు లేని విత్తనాలను అంటగడుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. విత్తన ఎంపిక, నకిలీని గుర్తించడంలో అవగాహన ఉండాలని పేర్కొంటున్నారు.

నకిలీ విత్తనం అంటే..

విత్తన ధ్రువీకరణ సంస్థ నుంచి అనుమతి లేని గింజలను నకిలీ విత్తనాలుగా పరిగణిస్తారు. అంతేకాకుండా ఎలాంటి అడ్రస్ లేకుండా అక్రమంగా అమ్ముతున్న విత్తనాలను కూడా నకిలీగానే భావించాలి. వాణిజ్య పరీక్షల నుంచి చోరీకి గురైన విత్తనాలు, నకిలీ ప్యాకింగ్ చేసి అమ్ముతున్న విత్తనాలు, లైసెన్స్ లేకుండా అమ్ముతున్న డీలర్ల వద్ద లభించే విత్తనాలను కూడా నకిలీగానే గుర్తించాలి.

నకిలీ విత్తనాలను గుర్తించడం రెండు రకాలు..

నకిలీ విత్తనాలను రెండు రకాలుగా గుర్తించొచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అందులో ఒకటి పంట వేయక ముందు, రెండోది పంట వేసిన తర్వాత. అయితే పంట వేయక ముందే నకిలీదని గుర్తిస్తే రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండొచ్చు. పంట వేసిన తర్వాత గుర్తించినా లాభం ఉండదు. అందుకే రైతులు విత్తనాలు ధ్రువీకరించుకున్న తర్వాతనే నాటుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

1. విత్తనం నాటక ముందు..

- ప్రభుత్వ లైసెన్స్ పొందిన డీలర్ల దగ్గరే విత్తనాలు కొనాలి.
- విత్తన ప్యాకెట్లపై కంపెనీ హోలోగ్రాం సరి చూసుకోవాలి.
- తక్కువ ధరకు వస్తున్నాయని మూట కట్టిన విత్తనాలను కొనొద్దు.
- రైతులు రశీదు(బిల్లు)లు తప్పకుండా తీసుకోవాలి.
- విత్తన బ్యాగు వెనక పచ్చరంగులో ఉంచిన స్టిక్కర్ లేదా ట్యాగ్ ఉందో లేదో చూసుకోవాలి. ట్రూత్‌ఫుల్లీ విత్తనం అయితే 'పచ్చ రంగు' ధ్రువీకరణ పొందిన విత్తనమైతే 'నీలి రంగు' ట్యాగ్‌లుంటాయి.
- విత్తన ట్యాగ్‌లపై కంపెనీ లైసెన్స్ నంబర్, లాట్ నంబర్, క్యూఆర్ కోడ్‌తోపాటు వ్యాలిడిటీ డేట్ కూడా చూసుకోవాలి.

2. పంట కాలంలో అయితే..

- విత్తనాలు సరిగా మొలకెత్తకపోవడం
- మొలకెత్తిన మొక్కలు ఎత్తుగా పెరగకపోవడం
- పూర్తిస్థాయిలో పూత రాకపోవడం
- వచ్చిన పూత రాలిపోవడం, కాయలుగా మారకపోవడం వంటి లక్షణాలు పంట సమయంలో గుర్తించొచ్చు.

దిగుబడిలో విత్తన ఎంపికే కీలకం..



పంటల దిగుబడి విషయంలో విత్తనాల ఎంపిక కీలకం. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో లైసెన్స్, క్యూఆర్ కోడ్, ప్యాకింగ్ డేట్, వ్యాలిడిటీ డేట్ చూసుకోవాలి. తక్కువ ధరకు వస్తున్నాయని విడి విత్తనాలు కొనొద్దు. రంగుల కవర్లలో ప్యాక్ చేసి అమ్ముతన్న విత్తనాల పట్ల జాగ్రత్తగా ఉండాలి.

డాక్టర్ రాజు, సమగ్ర సస్యరక్షణ శాస్త్రవేత్త

బ్రిడ్జి రక్షణ గోడను ఢీకొన్న కారు

- ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు


మహమ్మద్ ఇష్తాల్ అహ్మద్ మృతదేహం

రఘునాథపల్లి : కారు అతివేగం ఒకరి ప్రాణాన్ని బలిగొనగా, మరో ముగ్గురిని గాయాలకు గురిచేసింది. ఈ ఘటన హన్మకొండ, హైదరాబాద్ జాతీయ రహదారిపై నిడిగొండ బ్రిడ్జి వద్ద గురువారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కేశిరెడ్డి యోగేశ్వర్‌రెడ్డి తన కారులో హైదరాబాద్‌లో నలుగురు ప్రయాణికులకు ఎక్కించుకొని హన్మకొండకు బయలుదేరాడు. ఈక్రమంలో నిడిగొండ బ్రిడ్జి వద్ద అతివేగంగా వచ్చి అదుపు తప్పి రక్షణ గోడకు ఢీకొన్నాడు. దీంతో డ్రైవర్ సీటు వెనక కూర్చున్న హన్మకొండకు చెందిన మహమ్మద్ ఇష్తాల్ అహ్మద్ (43) అక్కడికక్కడే మృతి చెందగా మిగతా ముగ్గురు తాటికొండ నవీన్, కురిమిల్ల అనూష, ఝెగ్ర అవినాశ్‌కు గాయాలయ్యాయి. డ్రైవర్ యోగేశ్వర్ రెడ్డి ప్రమాదం నుంచి బయటపడి పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని క్షతగాత్రులను 108లో జనగామ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అతివేగం కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తండ్రి మహమ్మద్ ఖాజా అహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చాగర్ల రఘుపతి తెలిపారు.

కూతురికి మానసిక వ్యాధి..

- తమను రక్షించాలని తల్లి పోలీసులకు ఫిర్యాదు
- వైద్య పరీక్షల నిమిత్తం ఎంజీఎంకు తరలింపు


హసన్‌పర్తి: కూతురు మానసిక ప్రవర్తనతో ఇబ్బందులు పడుతున్నామని, ఆమె నుంచి తమను రక్షించాలని కోరుతూ తల్లి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. హసన్‌పర్తి మండలం సీతంపేటకు చెందిన క్రిష్టాది లక్ష్మికి ఇద్దరు కూతురులు ఉన్నారు. ఇందులో పెద్ద కూతురు రాజేశ్వరి(42) 28 ఏళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. రోజురోజుకూ ఆమె ప్రవర్తనలో మార్పు వస్తోంది. ఈ కారణంగా కుటుంబసభ్యులతో పాటు చుట్టుపక్కల వారు ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో తల్లిపై కూడా భౌతిక దాడులకు పాల్పడుతోంది.అలాగే, రాత్రి వేళల్లో గది తలుపులు వేసుకుని భయంకరంగా అరుస్తూ ఇబ్బందులకు గురి చేస్తోంది. దీనిపై స్పందించి తమ కూతురు నుంచి కాపాడాలని తల్లి కోరగా ఆమె ఫిర్యాదు మేరకు రాజేశ్వరిని వైద్య పరీక్షల నిమిత్తం ఎంజీఎంకు తరలించినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

పరువు తీస్తున్నారని.. వ్యక్తి ఆత్మహత్య


రాములు(ఫైల్)

ఐనవోలు: కుటుంబ సభ్యులే తన పరువు తీస్తున్నారని మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి.. ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని నాగపురంలో జరిగింది. ఎస్సై వెంకన్న కథనం ప్రకారం ఐనవోలు గ్రామానికి చెందిన ఆవునూరి రాములు(52) కుల వృత్తి కుమ్మరి పనితోపాటు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన రాములు.. నిత్యం తన భార్య, కుమారులతో గొడవ పడుతున్నాడు. కుమారులకు పెండ్లిళ్లు అయినప్పటికీ ఉమ్మడిగానే ఉంటున్నారు. తరచూ కోడళ్ల ఎదుట తన పరువు తీస్తున్నారని మనస్తాపానికి గురైన రాములు గురువారం నాగపురం వద్ద ఉన్న వ్యవసాయ క్షేత్రంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అటువైపు వెళ్తున్న ఒంటిమామిడిపల్లికి చెందిన వ్యక్తి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వర్ధన్నపేటకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు నరేశ్, సురేశ్ ఉన్నారు. భార్య హేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏడునూతులలో వివాహిత ..


శోభారాణి(ఫైల్)

కొడకండ్ల : ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని ఏడునూతులలో జరిగింది. గ్రామానికి చెందిన బోల్లోజు శోభారాణి(32), వెంకటాచారి దంపతులు. వీరు బుధవారం సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం కొమ్మాల గ్రామంలో జరిగిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలకు హాజరై వచ్చారు. ఈ క్రమంలో గురువారం ఉదయం దంపతుల మధ్య గొడవ జరిగి భర్త బయటకు వెళ్లగా శోభారాణి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. శోభారాణి మృతికి గల కారణాలు తెలియలేదు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, వెంకటాచారి కులవృత్తి, (వడ్రంగి) శోభారాణి టైలర్ పని చేసుకొంటూ కొడుకు, కుమార్తెతో కలసి జీవనం కొనసాగిస్తున్నారు.


కొడిశలకుంటలో మహిళ..

ములుగు రూరల్: కుటుంబ కలహాలతో వివాహిత బలవన్మరణం చెందారు. ఈ ఘటన మండలంలోని కొడిశలకుటంలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కొడిశల కుంటకు చెందిన పోరిక సంతోష్, కవిత (28) దంపతులు. వీరికి కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ చేశారు. అయినప్పటికీ గొడవలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో కవిత గురువారం ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఆత్మహత్య కేసులో ఐదుగురి అరెస్టు

కేసముద్రం: మండలంలోని ధర్మారం తండా జీపీ శివారు వెంక్యాతండాకు చెందిన బానోతు అశోక్.. తన భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మే 30న మృతి చెందాడు. ఈ ఘటనలో అత్తింటికి చెందిన ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు మహబూబాబాద్ మండలం ముత్యాలమ్మతండాకు చెందిన మృతుడి మామ వాంకుడోతు ఆనంద్, అత్త సత్రి, భార్య బేబి, మరిపెడ మండలం కొత్తతండాకు చెందిన తోటిఅల్లుడు భుక్యా నరేశ్, వదిన రజితను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

చికిత్స పొందుతున్న వృద్ధురాలి మృతి


భాగ్యమ్మ(ఫైల్)

డోర్నకల్ : వడదెబ్బకు గురైన ఓ వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. మండలంలోని ఉయ్యాలవాడకు చెందిన పగిడిపాల భాగ్యమ్మ(65) ఇటీవల ఎండకు అస్వస్థతకు గురై చికిత్స పొందుతోంది. ఈ క్రమంలో పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మృతి చెందింది.

పాద రక్షలు లేకుండా..దీక్ష


పాద రక్షలు లేకుండా నడుస్తున్న గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్

కొత్తగూడ: : కేసీఆర్ మూడోసారి సీఎం కావాలని ఆకాంక్షిస్తూ మంత్రి సత్యవతిరాథోడ్ ఆరునెలలుగా కాళ్లకు చెప్పులు వేసుకోకుండా కఠోర దీక్ష చేపడుతున్నారు. ఇందులో భాగంగా మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం మొండ్రాయిగూడెం గ్రామంలో జరిగిన దశాబ్ది ఉత్సవాల్లో మండుటెండలో గిరిజన సంక్షేమ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖామాత్యులు సత్యవతి రాథోడ్ నడిచారు. ఇప్పటికే ఆమె కాళ్లకు బొబ్బలు వచ్చాయి. అయినా దీక్షను విరమించకుండా పాద రక్షలు లేకుండానే నడుస్తున్నారు.

శభాష్.. వెంకటయ్య


సీపీఆర్ చేసిన అనంతరం శివరామయ్యతో హోంగార్డు వెంకటయ్య

రామన్నపేట: ట్రాఫిక్ హోంగార్డు..సీపీఆర్ చేసి ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడాడు. ఈ ఘటన గురువారం వరంగల్ నగరంలో చోటుచేసుకుంది. వరంగల్ హెడ్ ఆఫీసు సమీపంలో కడప జిల్లా బద్వేల్‌కు చెందిన పల్లెపు శివ రామయ్య అనే వ్యక్తికి ఒక్కసారి గుండె పోటు రావడంతో రోడ్డుపై పడిపోయాడు. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ హోంగార్డు వెంకటయ్య వెంటనే అతని వద్దకు చేరుకొని సీపీఆర్ చేయడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. వెంటనే అతడిని మెరుగైన చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సకాలంలో స్పందించిన ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడిన హోంగార్డు వెంకటయ్యను అధికారులు అభినందించారు.

దాడి ఘటనలో ఆరుగురిపై కేసు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరాకాలనీకి చెందిన పత్తి శ్రీకాంత్‌పై దాడి చేసి గాయపర్చిన ఘటనలో అతడి భార్య చందన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ ఎస్సై వి.దీపికా రెడి గురువారం తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో పత్తి శ్రీకాంత్‌పై వారి బంధువులు పత్తి మాధవి, శ్రీధర్, శ్రీహరి, శ్రీరాం, ప్రమీల, శివాని దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. కాగా, బంధువుల నుంచి తమకు ప్రాణభయం ఉందని చందన టౌన్ పోలీస్ స్టేషనలో ఫిర్యాదు చేసింది.

రాష్ట్రంలో ప్రగతి పరుగులు



కడవెండిలో సభలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి. చిత్రంలో కలెక్టర్ శివలింగయ్య, తదితరులు

'పల్లెప్రగతి'తో మారిన గ్రామాల స్వరూపం

- ఉద్యమవీరుల స్ఫూర్తితో కడవెండి రుణం తీర్చుకుంటా
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- రూ.4.41కోట్ల పంట నష్టపరిహారం చెక్కుల పంపిణీ

దేవరుప్పుల : బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అన్ని రంగాల్లో రాష్ట్ర ప్రగతి పరుగులు తీస్తోందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం కడవెండిలో నిర్వహించిన 'పల్లె ప్రగతి దినోత్సవ' కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రం దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన 1851 జీపీలు 'పల్లెప్రగతి' పనులతో సమగ్రాభివృద్ధి చెందాయని, తెలంగాణ ఓడీఎఫ్ రాష్ట్రంగా ఘనత సాధించిందని చెప్పారు. తాగు, సాగు నీటి కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో మహిళలకు వెసులుబాటు, భూమికి ధర పెరిగి అన్నదాతల ఆత్మగౌరవం పెరిగిందన్నారు. పొన్నాల లక్ష్మయ్య మంత్రిగా ఉన్న సమయంల ఈ ప్రాంత అభివృద్ధిని విస్మరిస్తే తాను సమగ్రాభివృద్ధికి కృషి చేసినట్లు ఎర్రబెల్లి పేర్కొన్నారు. ఉద్యమాల గడ్డ కడవెండి రుణం తీర్చుకోవడానికి 'పల్లెప్రగతి' దినోత్సవం కార్యక్రమాన్ని ఇక్కడి నుంచి ప్రారంభిస్తున్నట్టు వెల్లడించారు. చైతన్యవంతమైన ప్రజలు విపత్కర పరిస్థితుల్లోనూ మూడు దఫాలుగా ఆశీర్వదించడంతో నేడు మంత్రిగా రాణించగలుగుతున్నానని అన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఐఎస్ఓ సర్టిఫికెట్లకు ఎంపికైన జీపీల సర్పంచ్‌లు పోతిరెడ్డి బెత్లీనా(కడవెండి), యాకంతారరావు(పాలకుర్తి) తోపాటు కొడవటూరు, చిన్నపెండ్యాల జీపీలకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అలాగే జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం కింద రూ.4కోట్ల 40 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు కిట్లు అందజేశారు. డీపీఓ రంగాచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, డీఆర్‌డీఓ రామిరెడ్డి, డీఈఓ రాము, ఎంపీపీ బస్వ సావిత్రి, వైస్‌ఎంపీపీ విజయ, ఎంపీటీసీ కవిత, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ సురేష్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రమేష్, ఉపసర్పంచ్ నగేష్, విద్యాసాగర్, వీరాచారి, సోమయ్య, దయాకర్, బస్వ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ర్యాలీ అనంతరం నూతన జీపీ భవనం, పాలసేకరణ కేంద్రాన్ని, పాఠశాలలో డైనింగ్ హాల్, డిజిటల్ క్లాస్ గదిని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభకు అధ్యక్షత వహించగా ఆయన మాట్లాడారు.

'పెరుమాండ్ల'కు పెంపు లేనట్లే..!

ఈ నెల 21తో ముగియనున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ పదవి కాలం

- ఖాళీ చైర్మన్ స్థానానికి ఇంటర్వ్యూ
- ఇద్దరు రిటైర్డ్ ఇంజనీర్లు హాజరు
- ఆ ఇద్దరిలో ఎవరిని వరించేనో..



సీజీఆర్ఎఫ్ కార్యాలయం

హన్మకొండ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్-1) వరంగల్ చైర్మన్ పెరుమాండ్ల సత్యనారాయణ పదవీకాలం పెంపు లేనట్లేనని తేలిపోయింది. ఈ నెల 21తో మూడేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకోనున్న ఆయన.. మరికొంత కాలం చైర్మన్‌గా కొనసాగేందుకు ప్రయత్నాలు చేశారు. తనకున్న పరిచయాల ద్వారా పదవి కాలపరిమితి పొడిగింపునకు తీవ్రంగా ప్రయత్నించారు. కానీ ఆ ప్రయత్నాలు ఫలించలేదు. కాగా, విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి టీఎస్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ టీఎస్ ఎన్పీడీసీఎల్ పరిధిలో రెండు సీజీఆర్ఎఫ్‌లను ఏర్పాటు చేసింది. సీజీఆర్ఎఫ్-1 వరంగల్ కేంద్రంగా, సీజీఆర్ఎఫ్-2 నిర్మల్ కేంద్రంగా ఏర్పాటు చేశారు. వరంగల్ కేంద్రంగా ఏర్పాటు చేసిన సీజీఆర్ఎఫ్-1 ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల పరిధిలో పని చేస్తుంది. నిర్మల్ కేంద్రంగా ఏర్పాటు చేసిన సీజీఆర్ఎఫ్-1 ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లా పరిధిలో పని చేస్తుంది. టీఎస్ ఎన్పీడీసీఎల్ ద్వారా సేవలు అందడంలో ఆలస్యమైనా, సౌకర్యాలు కల్పించకపోయిన, విద్యుత్ సర్వీస్‌ల మంజూరు, ఆలస్యం వంటి సమస్యలను వినియోగదారులు సీజీఆర్ఎఫ్‌లో ఫిర్యాదు చేసి పరిష్కరించుకునేందుకు ఈ వేదికను ఏర్పాటు చేశారు.

మే 29న చైర్మన్ పదవికి ఇంటర్వ్యూ..

ప్రస్తుత వరంగల్ సీజీఆర్ఎఫ్ చైర్మన్ పెరుమాండ్ల సత్యనారాయణ 2020 జూన్ 22న బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్ల కాల పరిమితితో టీఎస్ ఈఆర్‌సీ అప్పట్లో సత్యనారాయణను చైర్మన్‌గా నియమించింది. పదవీకాలం సమీపించడంతో మే 29న చైర్మన్ పదవికి ఇంటర్వ్యూ నిర్వహించడంతో సత్యనారాయణకు పొడిగింపు దారులు మూసుకుపోయాయి. దీంతో త్వరలో కొత్త చైర్మన్ రానున్నారు. ఈ నెల 29న ఇంధన శాఖ, టీఎస్ ఈఆర్‌సీ నిర్వహించిన ఇంటర్వ్యూకు ఇద్దరు రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్లు హాజరయ్యారు. వీరిలో ఒక్కరికి సీజీఆర్ఎఫ్ చైర్మన్‌గా అవకాశం దక్కనుంది. టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో కన్‌స్ట్రక్షన్ ఇంజనీర్‌గా పని చేసి రిటైర్డ్ అయిన ఇ.నారాయణ, కమర్షియల్ చీఫ్ జనరల్ మేనేజర్‌గా పని చేసి రిటైర్డ్ వేణుగోపాలచారి ఇంటర్వ్యూకు హాజరయ్యారు. వీరిద్దరిలో ఒక్కరిని సీజీఆర్ఎఫ్ చైర్మన్‌గా నియమించే అవకాశముంది. ఈ నెల 21తో ప్రస్తుత చైర్మన్ సత్యనారాయణ పదవీ కాలం ముగియనుండడంతో ఈ లోపు నూతన చైర్మన్ నియామకానికి సంబంధించి ఉత్తర్వులు వెలువడే అవకాశముందని విద్యుత్ ఉద్యోగ వర్గాలు తెలిపాయి. కాగా, ఇంటర్వ్యూలు నిర్వహించిన వారిలో ఒక్కరిని చైర్మన్‌గా నియమిస్తుందా లేదా ప్రస్తుత చైర్మన్ పదవీకాలం పొడిగిస్తుందా అనే విషయంపై ఉత్తర్వులు వెలువడితేనే స్పష్టత వస్తుంది.

ఆర్టీసీ ఐటీఐలో ప్రవేశాలకు 19 చివరి తేదీ

ఐటీఐలో ట్రేడ్‌ల వివరాలు... (ఫీజు రూ.లలో)

ట్రేడ్	అర్హత	కాలవ్యవధి	సీట్లు	ఏడాదికి ఫీజు
డీజిల్ మెకానిక్	10వ తరగతి	1 సంవత్సరం	48	16,500
మోటారు మెకానిక్	10వ తరగతి	2 సంవత్సరాలు	24	16,500
వెల్డర్	10వ తరగతి	1 సంవత్సరం	20	16,500
పెయింటర్	10వ తరగతి	2 సంవత్సరాలు	40	16,5000

హన్మకొండ: వరంగల్ ములుగు రోడ్డులోని ప్రభుత్వరంగ సంస్థ టీఎస్ ఆర్టీసీ ఐటీఐలో ప్రవేశాలకు ఈ నెల 19 తుది గడువుగా నిర్ణయించారు. అనుభవజ్ఞులైన, సుశిక్షితులైన ఇన్‌స్ట్రక్టర్లతో అత్యుత్తమ విద్యా బోధన సాగుతోందని ప్రిన్సిపాల్ వంగాల మోహన్ రావు గురువారం తెలిపారు. సంస్థ డిపో గ్యారేజీలో అత్యాధునిక టెక్నాలజీ ఇంజిన్ (బీఎస్-6) వంటి బస్సులపై ఉత్తమ శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రొజెక్టర్ ద్వారా పాఠ్యాంశాల బోధన, కంప్యూటర్ శిక్షణ అందిస్తున్నారు. ఇదే సంస్థలో అప్రెంటీస్ సౌకర్యం కల్పిస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఐటీఐ లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9849425319, 8008136611 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దత్తత గ్రామాల్లో పనులు పూర్తి చేయాలి

- టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ గోపాల్ రావు


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ గోపాల్ రావు

హన్మకొండ: విద్యుత్ అధికారుల దత్తత గ్రామాల్లో పనులు త్వరితగతిన పూర్తి చేసి వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు ఆదేశించారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీ డీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఎస్ఈలు, డీఈలు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలు, డివిజన్లు, విభాగాల వారీగా ప్రతిని సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీఎస్ ఐపాస్, హెచ్‌టీ సర్వీస్‌ల మంజూరులో జాప్యం లేకుండా రిలీజ్ చేయాలన్నారు. కాలిన, పనిచేయని మీటర్లను మార్చాలన్నారు. రెండు సంవత్సరాలు పైబడిన వర్క్ ఆర్డర్లను పూర్తి చేయాలన్నారు. రూ.50,000 పైబడిన బకాయిని వసూలు చేయాలన్నారు. 33/11 కేవీ అంతరాయాలు తగ్గించి ఫీడర్లపై ఓవర్ లోడ్ భారం పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు లైన్ల నిర్వహణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ బి.వెంకటేశ్వర రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్ రెడ్డి, వి.తిరుపతి రెడ్డి, డీఈ (ఐటీ) అనిల్ కుమార్, సీజీఎంలు, ఎస్ఈలు, డీఈలు పాల్గొన్నారు.